# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 39 సంచిక 4
పేజీలు 44
డిసెంబర్ 2019

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

శ్రీకృష్ణ కర్ణామృతము .......... 4
శ్రీబాబూజీ ఉవాచ .......... 5
అమ్మమాట .......... 7
భజ గోవిందమ్ .......... 9
రామాయణంలో స్త్రీ పాత్రలు .......... 11
సత్సంగామృతం 2 .......... 13
బాబూజీతో అనుభవాలు .......... 16
గురు నిర్దేశం .......... 18
జ్ఞానరత్నం .......... 21
శ్రీ కృష్ణం వందే జగద్గురుమ్ .......... 25
విష్ణుచిత్తుడు - గోదాదేవి .......... 27
గుర్వష్టకమ్ .......... 29
రామలక్ష్మణులది విడదీయరాని బంధం .......... 31
ఎవరికి తెలియగ తరమౌను? .......... 32
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు .......... 34
అద్దాల గది .......... 35
కైవల్యోపనిషత్ .......... 37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర .......... 39
విష్ణు కథలు .......... 41

# శ్రీ కృష్ణ కర్ణామృతము - సుశీలా ప్రసాద

**ద్వితీయాశ్వాసము - 56 వ శ్లో॥**

**విక్రేతు కామా కిల గోపకన్యా మురారి పాదార్పిత చిత్త వృత్తిః**

**దధ్యాదీన్ మోహవశాదవోచ గోవిన్ద దామోదర మాధవేతి॥**

తాత్పర్యము -

ఒక గోపిక పెరుగు పాలు అమ్మబోయి నప్పుడు కృష్ణుని యందే మనస్సు గలది గావున ఆ మోహముచేత 'పెరుగోయమ్మా! పెరుగు' అనవలసినది బదులుగా 'గోవిందా! దామోదరా! మాధవా!' అని కేకలు పెట్టసాగింది. (ఆ గోపికకు సర్వమూ కృష్ణమయంగా తోచుచున్నది కావున లోకాతీత స్థితిలో ఆమె చిత్తము నిలిచిపోయింది.)



1. శ్రీబాబును నువ్వు అని సంబోధించగల స్వతంత్రం కలిగిన భక్తుడు?
2. విశిష్ట పూజ అంటే ఏమిటి?
3. మహాత్ముడు వేసిన బీజం పెంటకుప్పలోనైనా ఫలిస్తుందనటానికి ఉదాహరణ ఏమిటి?
4. ధనం ఎంతవరకు సంపాదించాలి?
5. బుద్ధుడికి ఆ పేరు ఎందుకు వచ్చింది?
6. గురుదేవుల శిక్షణ ఎలా వుంటుంది?
7. భగవానుడు మనకు ఏమిచ్చి బజారుకు పంపించాడు?
8. కంసుడికి భగవానుడు ఎటువంటి అవకాశం ప్రసాదించాడు?
9. నిజమైన పాండిత్యం అంటే ఏమిటి?
10. అర్చన భక్తికి ఉదాహరణ ఎవరు?

*సమాధానాలు లోపలి పేజీలలో .........................*

(గత సంచిక తరువాయి) # శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

ఇరువురు పుణ్యదంపతులు ఉండేవారు. వారు భగవచ్చింతన కలిగినవారు. వారికి ఏ లోటు లేకపోయినా సంతానం లేదనేది మాత్రం వారి మనసుల్ని పీడించేది. వారు ఎన్నో పుణ్యక్షేత్రాలు దర్శించారు, పూజలు చేశారు. సంతానం కోసం పండితులు చెప్పినవన్నీ ఆచరించారు. కాని ఫలితం శూన్యం. వారు అనుదినం తమకు సంతానాన్ని ప్రసాదించమని పరమేశ్వరుడిని ప్రార్థించేవారు. ఒకనాడు అనుకోకుండా వారిని అనుగ్రహించడానికే అన్నట్లుగా ఒక మహాత్ముడు వారింటికి విచ్చేశాడు. ఆ పుణ్యదంపతులు ఆ మహాత్ముడిని ఆదరించారు. ఆయనతో తమకు సంతానం లేని లోటును విన్నవించుకున్నారు. ఆ మహాత్ముడు ఆ దంపతుల ప్రార్థన విని, వారిని అనుగ్రహించి, సంతానప్రాప్తి కోసం మంత్రించిన విభూతిని ఇచ్చి ఇద్దరినీ స్వీకరించమంటాడు. అలా చెప్పి ఆ మహాత్ముడు వెళ్లిపోతాడు.



ఆ దంపతులు ఇరువురు తమలో తాము చర్చించుకొని మంత్రాలకు చింతకాయలు రాలతాయా? మనము ఎన్ని పూజలు చేశామో, పుణ్య కార్యాలు చేశామో, తీర్థయాత్రలు చేశామో. వీటికి ఫలించనిది ఈయన ఇచ్చిన విభూతికి ఫలిస్తుందా? అని ఆ విభూతిని పారేస్తారు. చూశారా! అదే సంస్కారహీనత అంటే. అది ఏ విధంగా క్రింద పడవేస్తుందో మీరు విన్నారు కదా! ఆయన మహాత్ముడని నమ్మి, ఆయనకు ఆతిథ్యము ఇచ్చి, తమ కోరికను ఆయనకు విన్నవించుకొని, ఆయన ఇచ్చిన విభూతిని తిరస్కరించటాన్ని ఏమంటారు? ఈవిధంగా పన్నెండు సంవత్సరాలు గడచిన పిమ్మట ఆ మహాత్ముడు తిరిగి ఆ దంపతుల్ని కలుస్తారు. మాటల సందర్భంగా ఏడీ నేను ప్రసాదించిన మీ వరపుత్రుడు? అని అడుగుతాడు. వాడిని చూద్దామని వచ్చానంటాడు ఆయన. దంపతులిద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని 'వరపుత్రుడేమిటి? మాకు ఎవరూ సంతానంలేరే స్వామీ!' అంటారు.

ఆ మహాత్ముడు ఒకసారి కనులు మూసుకొని 'ఆనాడు మీకు ప్రసాదించిన విభూతిని ఏం చేశారు?' అని అడుగుతాడు. 'దానిని మీరు స్వీకరించలేదు కదూ! ఆ పారవేసిన విభూతిని మీ పనిమనిషి ఈ గదిని, శుభ్రంచేసి మట్టితో సహా మీ పెరటిలో ఉన్న పెంటకుప్పపైన వేసింది కదూ!' అని అడిగాడు.

దంపతులు జరిగిపోయిన విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకొని తాము చేసిన తప్పును తెలుసుకుంటారు! ఆ మహాత్ముని పాదాలపైపడి క్షమించమని అంటారు. మహాత్ముడు వారిని కరుణించి 'లేవండి మీకు ప్రసాదించిన వరపుత్రుడు మీ ఇంటనే ఉన్నాడు' అని చెప్పి, పెరటిలో వున్న పెంటకుప్ప పైమట్టి అంతా తొలగించగానే పన్నెండేళ్ళ బాలుడు లేచి నుంచుంటాడు.

చూశారా! మహాత్ముడు బీజం పెంటకుప్పలో వేసినా కూడా అది ఎలా ఫలించిందో! కాని మీ హృదయాలలో ప్రవేశపెట్టిన ఈ బోధ వృథా అయిపోయినట్లయితే, మీ క్షేత్రాలు ఆ పెంటకుప్పకన్నా హీనమైనట్లేకదా! కాని అలా ఎన్నటికి జరగదు. మహాత్ములశక్తి అలా వుంటుంది. శ్రీ సమర్థ రామదాసుగారు అటువంటి మహాత్ముడు. ఆయన ఎప్పుడూ కౌపీనం ధరించేవాడు. చేతికి ఒక జోలెను తగిలించుకునేవాడు. అది భిక్షాటనకు ఉపయోగపడేది. కందమూలాదులను భుజిస్తూ శ్రీసీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రుడిని దర్శిస్తాడు. ఆయన 'శ్రీరామ జయరామ జయజయరామాయ' అనే మంత్రాన్ని జపిస్తాడు. అది విజయము సాధించిన మంత్రము.

శ్రీరామచంద్రుడు శ్రీసమర్థరామదాసు గారికి దర్శనమిచ్చి 'రామదాసూ! నీవు పుణ్యాత్ముడవు. సమర్థుడవు. నీవు సాధించవలసినది సాధించావు. కాని ప్రజలలో అశాంతి, అజ్ఞానము ప్రబలి ఉంది. కాబట్టి శ్రీరామనామ ప్రచారం చేసి ప్రజలకు మోక్షమార్గాన్ని చూపించు నాయనా' అని అంటాడు. శ్రీ సమర్థ రామదాసు శ్రీరామచంద్ర ప్రభువుకి నమస్కరించి 'స్వామీ! మీ ఆజ్ఞ నేను తప్పక శిరసావహిస్తాను. అయితే నాదో చిన్న షరతు. దానికి మీరు అంగీకరించాలి' అంటాడు. 'సరే చెప్పు నాయనా నీ షరతులు' అంటారు శ్రీరామచంద్రులు.

-సశేషం

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## నీ గురించి నీవు వెదుక్కోవటమే సాధన

అత్యంత దుర్లభమైన మానవజన్మ వచ్చినందుకు దానిని సార్థకం చేసుకోవడానికి మనం చేసే ప్రయత్నమే 'సాధన' అని పిలువబడుతుంది. సాధన సరిగా జరగాలంటే భావశుద్ధి కావాలి. భావన శుద్ధమవ్వాలంటే అంతఃకరణ శుద్ధి చెందాలి. ఆ అంతఃకరణ శుద్ధి చెందడానికి చేసే ప్రక్రియలే గురుబోధా శ్రవణము, మననము, నిదిధ్యాసలు, పూజ, జప, ధ్యానాదులు, నిష్కామ కర్మాచరణ, సత్సంగం, సద్గ్రంథ పఠనాదులు. దీనికి మనకు మార్గ దర్శకత్వం వహించి ముందుకు నడిపించే సత్యగురువు అత్యంత ఆవశ్యకము.



దేవుడనేవాడు మనకంటే భిన్నంగా లేడు. ఆయన సర్వాంతర్యామి, సర్వశక్తి మంతుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు. మనలోనే వుండి, మనని నడిపిస్తున్న ఆ చైతన్య శక్తినే మనం 'భగవంతుడు' అనే పేరుతో పిలుస్తున్నాం. వాస్తవానికి ఆ చైతన్య శక్తి రూప, నామ, క్రియా రహితమైనటువంటిది. రూపానికీ, నామానికి అలవాటు పడిపోయిన మనం ఆ అనంతశక్తిని ఒక రూపంగా ఆహ్వానించి ఆరాధిస్తున్నాము.

దేవుడికి పూజ చేయడమంటే వేరే ఎవరికో చేయడం కాదు. మనలోనే వుండి, మన జీవితానికి ఆధారభూతమైయుండి, మనల్ని నడిపిస్తున్న అనంతశక్తిని మేలుకొలపడమే 'పూజ', అదే 'ప్రార్థన', అదే 'ధ్యానం'. బాహ్యంగా పూలు, పండ్లు మొదలైనవి సమర్పించేవి 'సామాన్యపూజ'. అదే మనం మానసికంగా చేస్తే అది 'విశిష్టపూజ'.

మన పంచ జ్ఞానేంద్రియాలను, పంచ కర్మేంద్రియాలను, మనో, బుద్ధి, చిత్త, అహంకారములను భగవదున్ముఖం చేయడానికి బాహ్యాపూజ ఎంతో సహకరిస్తుంది. ఎన్ని పూజలు, ఎన్ని సేవలు చేసినా, మన మనస్సు భగవంతునిపై ఎంత సేపు నిలిచింది అన్నదే ముఖ్యం.

మనం ప్రతి ఏటా వినాయక వ్రతం, నవరాత్రిపూజలు

చేసుకుంటాం. ప్రతి ఏటా వినాయకుళ్ళని తెచ్చుకుంటాం, మళ్ళీ తిరిగి తొమ్మిది రోజుల తరువాత పంపించేస్తాం. అంతెందుకు, మన వంటింటిలో డబ్బాలో వున్న పసుపునే ఒక ముద్ద చేసి పసుపు వినాయకుడని అర్చిస్తున్నాం. కానీ ఈ వినాయకుడు వచ్చేవాడూ, పోయేవాడూ కాదని మనకి నేర్పించేవారే శ్రీ సద్గురుదేవులు.

'నేను చేస్తున్నాను' అనే అహంకార భావనని వదిలిపెట్టాలి. అంతా ఆ భగవంతుడే చేయిస్తున్నాడనే భావన కలిగివున్ననాడు, భగవంతుడు మనని ఎటువంటి తప్పుడు పనులనీ చేయనివ్వడు.

సాధకులు ఎప్పుడూ పరవిమర్శ చేయకూడదు. నిరంతరం ఆత్మవిమర్శ చేసుకోవాలి. సాధకుడు కోరుకోవలసినదల్లా, ఆనాడు సుదాముడు శ్రీకృష్ణుని కోరుకొన్నట్లుగా 'నీ పాద కమలసేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యమును, నితాంత అపార భూతదయయును తాపస మందార మాకు దయసేయగదే!' అని.

సాధన అనేది మనకన్నా భిన్నంగా లేదు అని గుర్తించాలి. నీ గురించి నీవు వెదుక్కోవటమే సాధన. నీ జీవితానికి ఆధారమెవరో గుర్తించడమే సాధన. అటువంటి సాధన సఫలీకృతమవ్వడానికి కావలసిన సాధనా సంపత్తిని, అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!



(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

# భజ  గోవిన్దమ్

**5. యావద్విత్తోపార్జన సక్తః**
**తావన్నిజపరివారో రక్తః।**
**పశ్చాజ్జీవతి జర్జర దేహే**
**వార్తాం కో పిన పృచ్ఛతి గేహే ॥**

మానవుడు ఎప్పుడూ తన స్వలాభం చూసుకుంటాడు. ఏదైనా వచ్చేది ఉంటేనేగాని, ఇతరులకు ఏదీ ఇవ్వడు. ఏదీ ఆశించకుండా ఇవ్వటం ధర్మం.



ధనం ఉంటే ఏదైనా కొనవచ్చు అనుకుంటాం. ఇది నిజంకాదు. బాధాకరమైనది కూడా. ధనంతో ప్రేమానురాగాలు కొనగలమా? ఒకప్పుడు ధనికుడైనవాడు నిర్ధనుడైతే అతడిని ఎవ్వరూ పట్టించుకోరు. ధన సముపార్జన ప్రాపంచిక సుఖాలను పొందింపచేస్తుంది. అది సంసార యాత్ర చేయటానికి పనికి వస్తుంది. కాని ధనం ఎంతవరకు సంపాదించాలి? అంటే భార్యాబిడ్డలను పోషించుకోవటానికి, ఇంకా మిగిలితే దాన ధర్మాల కొరకు సంపాదించాలి.

దీనిని దృష్టిలో పెట్టుకొని శ్రీ శంకరాచార్యులవారు ఇలా చెబుతున్నారు : ధనం ఉన్నంతవరకు నిన్ను అందరూ ప్రేమిస్తారు. ధనం క్షీణమైనప్పుడు, వార్ధక్యం సమీపించినప్పుడు నీ బంధు మిత్రులు నిన్ను ఆదుకోరు. ఇది ఎంత దురదృష్టకరమైన విషయం? ఈ నిజాన్ని గ్రహించి ఎంతవరకు అవసరమో అంతవరకు ధనం సంపాదించి, దారాపుత్రులను పోషించగా మిగిలినది దాన ధర్మాలకు ఉపయోగిస్తూ ఆనందంగా వుండాలి కాని ధన సంపాదన నీ జీవిత లక్ష్యం కాకూడదు. కాబట్టి మానవుడు ఈ అనిత్యమైన వాటినుంచి మనస్సును మరల్చి భగవంతుని వైపు తిప్పాలి.

యవ్వనంలో ఉన్నవారు జీవితంలో సుఖాలను కోరుకుంటారు.

ధనం సంపాదించవచ్చు, దాచుకోవచ్చు. పంచిపెట్టవచ్చు, దేశ సేవకు ఉపయోగించవచ్చు - కాని ఇది ముఖ్యం కాదు.

పరమార్థ ప్రాప్తికి చేసే సాధనే నిజమైన సాధన. ఈ ప్రపంచం నిన్ను తిరస్కరించే ముందే, నువ్వే ఈ ప్రపంచాన్ని అధిగమించి మనశ్శాంతి పొందాలి.

-సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

***డిసెంబర్ 2019***

2 సోమ - సుబ్రహ్మణ్య షష్ఠి సా॥5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ.

3 మంగళ - శ్రీబాబూజీ స్వస్వరూపలయం చెందిన రోజు. సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

7 శని - గీతా జయంతి. సా॥ 5-30గం. శ్రీ సద్గురుపాదపూజ, భక్త సమారాధన.

11 బుధ - మార్గశిర పౌర్ణమి, దత్తజయంతి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

16 సోమ - శ్రీధనుర్మాస వ్రత ప్రారంభం.

21 శని - శ్రీ గురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

25 బుధ - క్రిస్మస్ - ఉదయం 11 గం. శ్రీసద్గురుపాదపూజ.

***జనవరి 2020***

1 బుధ - ఆంగ్ల సంవత్సరాది. సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

6 సోమ - ముక్కోటి ఏకాదశి. సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

10 శుక్ర - పుష్య పూర్ణిమ - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

14 మంగళ - భోగి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ. రాత్రి 7గం.లకు శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

15 బుధ - సంక్రాంతి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

19 ఆది - శ్రీగురుదశమి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ.

30 గురు - శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠా పంచమ వార్షికోత్సవము (2015 మాఘ శుద్ధ పంచమి)

# రామాయణంలో స్త్రీ పాత్రలు

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## సుమిత్ర

**అయోధ్యామటవీ విద్ధి** - రామచంద్ర ప్రభువు లేని అయోధ్య అడవితో సమానమే. కనుక శ్రీరామ చంద్రుని సన్నిధిలో అడవిలో వున్నా, అది మహదానందమైన అయోధ్యయే. **గచ్ఛతాత! యథా సుఖమ్** - నీకు ప్రాంతములతో నిమిత్తము లేదు. కాబట్టి కలిగినంత సౌఖ్యముతో, నీ పరోక్ష జననీ జనకులను సేవిస్తూ, వెంట వెళ్ళు నాయనా!' అని దీవించి పంపించింది సుమిత్ర.

భావార్థ సూచితమగు, అంతరాత్మ ప్రబోధమును అనుసరించి, ఆ సాధ్వీమతల్లి వెళ్ళు అన్నదేగాని, వెళ్ళిరా నాయనా అనలేదు. ఇలా అనటంలో కేవలం దుఃఖభావమే ప్రధానము కాదు, పరమాత్మ విజ్ఞానము కూడా ఇమిడి వున్నది.

రామసేవా దురంధరుడగు లక్ష్మణునకు రాముని మించిన తండ్రి, దైవము వేరే లేదు కనుక, రాముని పితృదేవునిగా భావించి, తరించమని అర్థము. దశరథుడనగా, పక్షివాహనుడగు శ్రీమన్నారాయణాంశ సంభూతుడు, దుష్టదైత్యాంతకుడైన శ్రీమహావిష్ణువుగా గ్రహించమని అర్థం. **'అయోధ్యామటవీ విద్ధి'** - అనగా కేవలం శరీర బల సంపత్తిచే, సాధింపరానిది. అంటే పరమపదము లేక వైకుంఠమని అర్థం. అందుచేతనే సీతారాములున్న ప్రదేశమే వైకుంఠము, వారు లేని ప్రదేశం అయోధ్య అయినా కూడా అడవి కంటే హీనమని అర్థం. అందుచేతనే జగజ్జననీ జనకుల సేవయే నీ జీవిత లక్ష్యముగా భావించి, సేవించి తరించు నాయనా!' అని పరమ గంభీరంగా చెప్పింది. ఆమె పరమ ధార్మిక, విజ్ఞాన మూర్తియైన మాతృమూర్తి. శీతోష్ణ, సుఖదుఃఖములను సమదృష్టితో స్వీకరించి, సంయమనమును పాటించే స్థితప్రజ్ఞురాలు. ఆమెలో స్వార్థ చింతనకు తావులేదు. సుమిత్ర కరుణామృత, పరమ ధార్మిక, జ్ఞాన ప్రబోధమునకు నిలయమై ప్రకాశించింది.

పుత్ర వియోగముతో కుమిలిపోతున్న కౌసల్యను, తాను కూడా

అదే పరిస్థితిలో వున్నప్పటికీ దానిని కించత్తైనా లెక్కచేయని స్థితప్రజ్ఞురాలు. తన తీయని మాటలతో, హిత వచనాలతో, సవతి కౌసల్యకు ఊరట కలిగించి, బాధను అదృశ్యం చేసిన అమోఘమైన పాత్ర సుమిత్రాదేవిది. ఆమె పలికిన ఒక్కొక్క పలుకు సుధా బిందువు. విజ్ఞానఖని. చిత్రమేమిటంటే, సుమిత్ర పరిస్థితి, కౌసల్య పరిస్థితి ఒక్కటే. ఇద్దరి తనయులు తమకు దూరమవుతున్నారు. కాని సుమిత్రాదేవి సంయమమును కోల్పోక, సుఖదుఃఖాలకు, శీతోష్ణాలకు అతీతంగా నిలిచి దృఢవ్రతురాలు, స్థితప్రజ్ఞురాలు. మిత్రజీవనమునకు, పవిత్ర భావ సంయమమునకు ప్రతిరూపమైనది. సుమిత్ర పాత్ర ధర్మపూరితమై, భావోద్రేకమెరుగని, చక్కని హితవచనాలతో సుమిత్ర, కౌసల్యను దుర్భర శోకము నుండి బయటపడేటట్లు చేసింది.

-సశేషం

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

**డిసెంబర్ 2019**

11 బుధ - మార్గశిర పౌర్ణమి, దత్తజయంతి - శ్రీ సద్గురుపాదపూజ.

16 సోమ - శ్రీధనుర్మాస వ్రత ప్రారంభం.

21 శని - శ్రీ గురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

26 గురు - అమావాస్య. సూర్యగ్రహణం (ఉ॥ 8-12ని॥ నుండి 11-22ని॥ వరకు)

**జనవరి 2020**

6 సోమ - ముక్కోటి ఏకాదశి. శ్రీసద్గురుపాదపూజ

10 శుక్ర - పుష్య పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ.

14 మంగళ - భోగి - శ్రీసద్గురుపాదపూజ రాత్రి 7గం.లకు శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

15 బుధ - సంక్రాంతి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

19 ఆది - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

# సత్సంగామృతం - 2

- మురళీ

**శ్రీ బాబూజీ మహరాజ్ వారి దివ్యబోధామృతం** (13-5-1980)

జీవితం క్షణ భంగురమైనది . ఇట్టి జీవితాన్ని పాప చింతనలతో వృధా చేయుటకంటే పుణ్యము చేస్తూ భగవద్భక్తి భావనతో గడిపితేనే మానవ జన్మకు సార్థక్యము. దయా స్వరూపుడగు బుద్ధభగవానుడు బోధించిన ధర్మము పవిత్రమైనది. 'ఎల్లప్పుడూ పుణ్యకార్యములు చేస్తూ, జీవితమును మానవ సేవకై వినియోగిస్తే పవిత్రత కలుగుతుంది. శాశ్వత పదమగు నిర్వాణ సుఖము కలుగుతుంది' అని బుద్ధుడు బోధించాడు. బౌద్ధ ధర్మము ప్రపంచ విఖ్యాతమైనది. భారత దేశము చైనా, జపాన్, శ్రీలంక దేశములలో విస్తరించింది.

బుద్ధుడు మహాజ్ఞాని. అతనికి ముందున్న చక్రవర్తులు, తరువాత వారు ఎందరో గతించారు. అతడు మాత్రం శాశ్వతముగా దివ్య జ్యోతివలె ప్రకాశిస్తున్నాడు. అతని ముందువారికి, తరువాత వారికి ఏవిధమైన గుర్తింపు లేకుండా పోయింది. మహాజ్ఞాని అవతరించిన వంశము పవిత్రముకాగా ఆ వంశము అంతా ప్రకాశిస్తుంది. దీనికి ఉదాహరణగా ప్రహ్లాదుని తీసుకోవచ్చు. అతని వంశములో బలి చక్రవర్తి, బాణుడు మొదలైన ప్రసిద్ధులు ఎందరో అవతరించినప్పటికి ప్రహ్లాదుని వలన వారికి గౌరవ ప్రతిష్ఠలు కలిగాయి గాని వారి వలన ప్రహ్లాదుని కీర్తి పెరగలేదు.

అట్టి మహాజ్ఞాని అయిన బుద్ధ భగవానునికి కూడా ఒక సారి కొంచెం మాయ ఆవరించింది. కాని దానికి అతడు లోబడలేదు. అందమైన భార్య, ముద్దులొలుకు కుమారుడు, మహా సామ్రాజ్య రాజరికము అతని సొత్తు. వీటిలో ఏ ఒక్కదానినైనా బుద్ధిపూర్వకముగా పరిత్యజించటం చాలా కష్టం. అటువంటిది ఈ మూడింటిని పరిత్యజించి అతడు సత్యాన్వేషణకై బయలుదేరి వెళ్ళాడు. అతడు వెళ్ళే ముందు మూడు పర్యాయములు వెనుకకు మరలాడు. మొదటిసారి తన ముద్దులొలుకు కుమారుని గురించి ఆలోచనతో మరలాడు. ఇది పుత్రేషణ. రెండవసారి గుమ్మంవరకు వెళ్ళిన తరువాత అతని అందమైన భార్య యశోధర మదిలో మెదిలి వెనుకకు తిరిగాడు. ఇది దారేషణ. మూడవసారి వైభవోపేతమైన తన రాజ్యము గుర్తు వచ్చి వెనుకకు తిరిగాడు. ఇది ధనేషణ. ఇలా వెనుకకు మరలితే ఈ మాయ వలన

ఏమి ప్రమాదము ముంచుకు వస్తుందో అని భయపడి ఒక్క గెంతు గెంతి గుమ్మం దాటాడు. తరువాత జీవితంలో అనేక కష్టాలకు గురికావలసి వచ్చింది. అతనిది 'రాజ గుండె' కనుక కష్టములనన్నింటినీ ఎదుర్కొన గలిగాడు.

మొదట అతనిని ఆకలి దప్పికలు, కామక్రోధములు బాధించాయి. అతడు ధైర్యముగా వాటిని ఎదిరించి జయించాడు. అతనికి సత్య స్వరూపమైన జ్ఞానము మొదటలో లభించలేదు. ఆయన తన లక్ష్యార్థము సాధించే వరకు పట్టుదల వదలకుండా సాధనచేసి, పరమ జ్ఞానమును పొంది బుద్ధ భగవానుడై ప్రపంచమునకు మార్గోపదేశము చేశాడు. మానవులు జీవితములను దుఃఖ భూయిష్టముగా చేసుకొంటున్నారని గుర్తించాడు. అతని మనో బుద్ధి చిత్తహంకారములు సత్యం శాంతి దయ ప్రేమగా మారాయి. శాశ్వతమైన జ్ఞానసిద్ధిని పొందినవాడగుటచే అతనికి బుద్ధుడను పేరు కలిగింది. సమస్త ప్రపంచమును ఆత్మకు భిన్నముగా అతడు గుర్తించగలిగాడు. అందుచే 'అహింసా పరమోధర్మః' అనే సిద్ధాంతాన్ని ముఖ్యముగా వుద్బోధించాడు. సమస్త ధర్మములు అహింసా ధర్మములో ఇమిడి వున్నాయని గ్రహించి, ఆచరించి, బోధించాడు. మానవుడు ఎంత ధనమునైనా సంపాదించ వచ్చు, కాని దాని వలన సుఖం కలుగుతుందని చెప్పడానికి వీలులేదు. ధనికుడు అజీర్తితో బాధపడతాడు. విమానంలో ప్రయాణించేవానికి కూడా కడుపు నొప్పి ఉంటుంది. ఇంక సుఖం ఎక్కడిది? శాశ్వతమైన సుఖము ధనాదులలో లేదు.

సాధన చతుష్టయము, నిత్యానిత్య వస్తు వివేకము, ఇహాముత్రఫలభోగ విరాగము, శమదమాది షట్కసంపత్తి, ముముక్షత్వము. వీనిలో నిత్యానిత్య వస్తువివేకము కలిగిన పిమ్మట ఇహాముత్ర ఫలభోగ విరాగము, శమదమాది షట్కసంపత్తి కలుగుతాయి. ముముక్షత్వము అనగా మోక్షేచ్ఛ. సుఖాపేక్ష అందరికీ కలిగేదే. ఆ సుఖస్వరూపమే మొదట తెలుసుకోవాలి. శాంతి సాధనకు వైరాగ్యము,శమదమాది షడ్గుణములు ముఖ్యమైనవి.

అనిత్యములైన వస్తువులపై ఇచ్ఛ లేకపోవుటయే ఫలభోగ విరాగము. జీవితంలో కష్టం తొలగి వైరాగ్యం సిద్ధించినప్పుడు శమదమాది షడ్గుణములు ఏర్పడతాయి. శమము, దమము, ఉపరతి,

తితీక్ష, శ్రద్ధ, సమాధానము. మనో బుద్ధి అహంకారములనే అంతరింద్రియములను విషయాదులపై ప్రవర్తింప నీయక, సదా బ్రహ్మమునందు నిలుప గలుగుటయే 'శమము', జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములను వాని వ్యాపారములందు ప్రవర్తింపనీయక, వానిని పరమేశ్వరుని యందు ఐక్యమొందించుట 'దమము'. చంచలమైన మనస్సును నిశ్చలము చేసి బాహ్య విషయముల నుండి మరల్చి దానిని బ్రహ్మమునందు నిలుపుటయే 'ఉపరతి'. గురువాక్యము సత్యము అను నిశ్చయబుద్ధితో నమ్మియుండుటయే శ్రద్ధ. ఏకాగ్రముగా లక్ష్యార్థముపై బుద్ధిని నిలుపుటయే సమాధానము. శ్రద్ధ, సమాధానములను శ్రద్ధాభక్తులని కూడా వ్యవహరిస్తారు.

ఇహలోక సంపద తిరిగి పోతుంది. దొంగల బాధ, బంధువుల బాధ, ఇతరులు అపహరిస్తారనే భయము కలిగిస్తుంది. శమదమాది షట్కముల వలన కలిగిన సంపద తనకు, ఇతరులకు అందరికీ శాశ్వతమైన ఆనందము కలిగిస్తుంది. భౌతిక సంపద క్షణికమైనది. శమదమాది షట్కముల వలన కలిగే సంపద శాశ్వతమైనది. ఆనందప్రదమైనది. మనో బుద్ధి చిత్తహంకారములను సత్యం శాంతి దయ ప్రేమగా మార్చగలుగుతుంది. శమదమాది షడ్గుణైశ్వర్యములను పెంపొందించుకొని నిస్వార్థ సేవా తత్పరతతో అభ్యుదయ పథములతో సంచరించండి. జగన్మాత సర్వదా రక్షించుగాక!

**సమర్థ సద్గురు మాసపత్రిక పాత ప్రతులను ఆన్‌లైన్‌లో చదవడానికి మీ స్మార్ట్‌ఫోన్‌తో ఈ ప్రక్కన ఇవ్వబడిన QR CODE స్కాన్ చేయండి.**

మీ మాసపత్రిక చందా నెంబరు LM అనే అక్షరాలతో ప్రారంభమయితే మీ చందా గడువు ఇప్పటికే ముగిసినది. అయినా శ్రీగురుదేవుల ఆధ్యాత్మిక సంపద అందరికీ అందజేయాలనే మహదాశయంతో ట్రస్టువారు స్వంత ఖర్చుతో ఇంకా పత్రిక మీకు పంపుతున్నారు. కనుక దయచేసి 1,116 రూలు చెల్లించి మీ చందాను పునరుద్ధరించు కొనవలసినదిగా విజ్ఞప్తి.

# బాబూజీతో అనుభవాలు

- కృష్ణారావు బొంబాయి

1. శ్రీబాబూజీ మహరాజ్ ఒక యువకుడికి ఒక పెళ్ళి సంబంధం సూచించారు. అప్పుడా భక్తుడు వినయంగా 'నేనింకా జీవితంలో స్థిర పడలేదు కాబట్టి అప్పుడే నాకింకా ఆ ఉద్దేశం లేదు బాబు' అన్నాడు. కొన్ని నెలల తరువాత అదే యువకుడు మళ్ళీ బాబూజీని కలిసినప్పుడు వారు 'ఏమైనా అయిందా? నువ్వెక్కడికైనా వెళ్ళావా?' అని అడిగారు. అతనికి విషయం అర్థమై, తన తప్పు అంగీకరిస్తూ ...'ఆ రోజు మీతో నాకు పెళ్ళి వద్దన్నాను. కానీ ఒక రోజు నేను కోరిక చంపుకోలేక మొదటిసారిగా వ్యభిచార గృహానికి వెళ్ళాను. అయితే అక్కడ గుమ్మంలోనే తమరు నవ్వుతూ నాకు దర్శనం ఇచ్చారు. వెంటనే నేను వెనక్కి తిరిగి వచ్చేశాను' అన్నాడు. గురుదేవుల అనుక్షణ రక్షణకు ఇది ఒక మచ్చు తునక!

2 శ్రీ తారక పరబ్రహ్మ శాస్త్రిగారు 'ఆంధ్ర సాహిత్యము నందు అద్వైత తత్త్వ కావ్యములు' అనే విషయంపై డా॥ దివాకర్ల వేంకటావధానిగారి మార్గదర్శకత్వంలో పి.హెచ్.డి చేస్తున్నప్పుడు ఒక దశలో వారిద్దరికీ కూడా పరిశోధన ముందుకు సాగలేదు. అవధానిగారికి శ్రీబాబూజీ శక్తి గురించి తెలుసు. అందువలన ఆయన తారకంగారిని వెళ్ళి బాబూజీని అడగమని, ఆయనే మనకు దారి చూపించగలరని చెప్పారు. తారకం గారు ఆశ్రమానికి వచ్చి, శ్రీబాబూజీకి విషయాన్ని వివరించారు. శ్రీబాబు 'ఇక్కడ కూర్చుని ధ్యానం చెయ్యి. నీకు సమాధానం వస్తుంది' అన్నారు. అలా ధ్యానం చేసిన తరువాత తారకంగారు ఏకధాటిగా 30 పేజీలు వ్రాశారు. అందులో ఒక్క తప్పుకూడా లేదని వేరే చెప్పాలా? బాబూజీ మహరాజ్ తారకంగారికి దిశా నిర్దేశం చేస్తూ 'నీకెప్పుడు ఏ సమస్య వచ్చినా ధ్యానం చేసుకో, సమాధానం దొరుకుతుంది. నువ్వు దాని కోసం ఇక్కడ దాకా రానవసరం లేదు' అని చెప్పారు.

3. ఒకరోజు భక్తులందరూ బాబూ విజ్ఞానమందిరంలో సమావేశమై వున్నారు. బాబూజీ సుగుణక్కను తలుపు మూసి, ఇంక ఎవరినీ లోపలికి

రానివ్వకు అని చెప్పారు. కొంతసేపటికి రైల్వే మూర్తి గారు బాత్‌రూమ్‌కి వెళ్ళడం కోసం తలుపు తీసుకుని బయటకు వెళ్ళారు. ఆయన తిరిగి వచ్చినప్పుడు ఆయన ఇదివరకే లోపలినుండి వెళ్ళారు కదా అని సుగుణమ్మగారు తలుపు తీసి, లోపలికి పంపించారు. బాబూజీ కోపంగా వారిద్దరినీ బయటకు వెళ్ళిపొమ్మన్నారు. వారు వెళ్ళిన తరువాత శ్రీబాబూజీ సుగుణక్కను మెచ్చుకుంటూ 'చూశారా! నేను బయటకు వెళ్ళమనగానే సుగుణ ముఖంలో ఎటువంటి మార్పు, కోపం లేకుండా ఎలా బయటకు వెళ్ళి పోయిందో! ఆవిడ మానసిక స్థితిలో ఎటువంటి మార్పు లేదు. ఇది 'శిక్షణ' కానీ 'శిక్ష' కాదు' అన్నారు.

4. ఒకరోజు శ్రీబాబూజీ మహరాజ్ కొంతమంది బ్రాహ్మణులను విజ్ఞాన మందిరంలో భోజనానికి ఆహ్వానించారు. వాళ్ళకి వడ్డించిన తరువాత హనుమాయమ్మగారు అక్కడే వున్న వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కోవడానికి వెళ్ళారు. బాబూజీ మహరాజ్ వెంటనే 'నువ్వు ఇదెందుకు వాడుతున్నావు? ఇది అందరికోసం కాదు. బయటకు వెళ్ళి కడుక్కో' అని మందలించారు. ఆవిడ అలాగే చేశారు. ఆ బ్రాహ్మణులందరూ భోజనం ముగించుకుని చేతులు కడుక్కోవడానికి బయటకు వెళ్ళడానికి సిద్ధమయ్యారు. బాబూజీ వారిని వారిస్తూ, 'మీరు బయటకు వెళ్ళనవసరం లేదు. మీరీ వాష్ బేసిన్‌ను ఉపయోగించుకోవచ్చు' అన్నారు. కొన్ని క్షణాల తరువాత బాబూజీ మహరాజ్ వివరిస్తూ 'ఆవిడ ఒక పండిన మామిడి పండు. నేను ఆవిడను మందలించినప్పుడు ఆవిడ మానసిక స్థితిలో ఎటువంటి మార్పు లేకుండా బయటకు వెళ్ళింది. అదే నేను మిమ్మల్ని బయటకు వెళ్ళమంటే మీకు కోపం రావచ్చు. మీరు మళ్ళీ నా దగ్గరకు రాకపోవచ్చు కూడా. అందుకే నేను మిమ్మల్ని ఈ వాష్‌బేసిన్ వాడుకోవడానికి అనుమతిచ్చాను. మీరింకా పండవలసి వుంది' అన్నారు.

కాబట్టి సాధకులు శ్రీబాబు తెలిపిన విషయాలను అర్థం చేసుకుని ఆచరించాలి.

# గురు నిర్దేశం

- రమణ ప్రసాద్

శ్రీగురుదేవులు నడయాడిన ఈ భీమవరం నగరంలో అన్నపూర్ణా సమేత శ్రీ సోమేశ్వర స్వామి వారి దివ్య సన్నిధిలో ప్రకాశిస్తున్న సర్వ దేవతలకు, అలాగే ఈ సత్సంగ సేవలో పాల్గొంటున్న భగవద్భక్తులలో ప్రకాశిస్తున్న శ్రీగురుదేవులకు శిరసా ప్రణమిల్లుతూ, సర్వేభ్యో మహా భక్తేభ్యోనమః . మనకు శ్రీ గురుదేవులు ప్రసాదించిన 'హరేరామ నామ సంకీర్తన సప్త సప్తాహాల చతుర్థ భాగంలో మొదటిరోజు. శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారు కూడా ఈ నగరంలో ఎన్నో మార్లు సంకీర్తన చేశారు. శ్రీ గురుదేవుల సన్నిధిలో శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారు సంకీర్తన చేస్తుంటే శ్రీ గురుదేవులు పరమానందం పొందేవారు. ఆనందాశ్రువులతో వారి బట్టలు తడిసిపోయేవి.

'భీమవరం'- 'భ' అంటే ప్రకాశం. అంటే ఆత్మ ప్రకాశం. ఇక 'వరం' అంటే అందరకీ వరమే. ఎవరైతే ఆత్మ తత్త్వాన్ని జుట్టుకోవటానికి పాత్రులై ఉంటారో, వారి జీవితాలకిది వరమే.

శ్రీమద్భాగవతంలో నవ విధ భక్తుల గురించి చెప్పబడింది. అవి

**శ్రవణం కీర్తనం విష్ణో స్మరణం పాద సేవనం ।**

**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్ ॥**

**1. శ్రవణం** - భగవంతుని లీలలను వినడం - పరీక్షిన్మహారాజు.

**2. కీర్తనం** - ఆయన లీలలను పాడడం - శుక బ్రహ్మ.

**3. విష్ణోస్మరణమ్** - నిరంతరం భగవన్నామాన్ని తలవడం - ప్రహ్లాదుడు.

**4. పాదసేవనం** - స్వామి వారి పాదములను ఒత్తడం మున్నగు సేవలు చేయడం - లక్ష్మీదేవి.

**5. అర్చనం** - స్వామిని నిత్యం పూజించడం - పృథు మహారాజు.

**6. వందనమ్** - భక్తితో నమస్కరించడం - అక్రూరుడు.

**7. దాస్యం** - దాస్య భక్తితో స్వామిని సేవించడం - ఆంజనేయస్వామి.

**8. సఖ్యం** - స్వామి నా చెలికాడు అనే భావంతో మెలగడం - అర్జునుడు.

**9. ఆత్మ నివేదనము** - స్వామీ! నా సర్వస్వమూ (మనోవాక్కాయములు) వున్నది నీ కొరకే అనే భావంతో ఆత్మార్పణం చేయడం - బలి చక్రవర్తి, గోపికలు.

శ్రవణం ఎంతో ముఖ్యం అని శ్రీ గురుదేవులు ఎప్పుడూ చెబుతూ -'శ్రద్ధగా శ్రవణంచేస్తే అది మననం కూడా చేసినట్లే అవుతుంది' అనేవారు.

ఇప్పుడు మనం సత్సంగంలో ఉన్నాం. "***సత్ కీ నావ్ ఖేవటియా సదుగురు భవసాగర్ తరి ఆయో। పాయోజీ మైనే రామ రతన్ ధన్ పాయో।*** మీరా తల్లి అంటోంది, 'సత్యమనే నావని నడిపే నావికుడు సద్గురువు. ఆయన భవసాగరాన్నుండి తరింపచేస్తాడు. ఆయన వద్దనుండి నేను రామ రత్నమనే ధనాన్ని పొందాను. అది తరిగేది కాదు. దిన దిన ప్రవర్థమాన మవుతుంది' అని అర్థం.

రాముడు ఎప్పుడూ శివుడిని ధ్యానిస్తూ ఉంటే, శివుడు ఎప్పుడూ రాముడిని ధ్యానిస్తూ ఉంటాడట.

***యథా శివమయో విష్ణుఃరేవం విష్ణుమయ శ్శివః।***

***యథాన్తరం న పశ్యామి తథామే స్వస్తి రాయషీ॥***

**యాథాన్తరం నభేదాన్స్యశ్శివ కేశవ యోస్తథా ॥**

శివునికి విష్ణువుకి భేదం లేదని శ్రీకుమారస్వామి తాను తెలుసుకొని తన అనుభవాన్ని తన తండ్రి గారైన శివునికి స్కందోపనిషత్తులో చెబుతున్నాడు. తన తండ్రే తన గురువు. కాని మనం సుజ్ఞానులమైనా శివ కేశవులకు భేదం ఆపాదిస్తాం. అది అజ్ఞానం. తన తండ్రి వద్ద ఉపదేశం పొంది, ధ్యానం చేసి తను పొందిన అనుభవాన్ని తన తండ్రికి ఇంకా ఇలా చెబుతున్నాడు కుమారస్వామి - "**అచ్యుతోస్మి మహాదేవ! తవ కారుణ్య లేశతః**" - ఓ మహాదేవా! నేను చ్యుతుడనుకాను. నీ కారుణ్య లేశం చేత నేను అచ్యుతుడనైనాను" అని. ముందు ఈ దేహం నేను కాదు అని తెలుసుకోవాలి. కాని మన సాధనకు దేహం అవసరం. ఆ తరువాత ఇంకా ఇలా చెబుతున్నాడు -

***దేహో దేవాలయః ప్రోక్తో జీవోదేవ స్సదా శివః।***

***త్యజేదజ్ఞాన నిర్మాల్యం సోహంభావేన పూజయేత్।***

నువ్వు పూజకి, అభిషేకానికి బజారుకు వెళ్ళి పూజా ద్రవ్యాలు సేకరించ నక్కరలేదు. నీలో ఉన్న సత్యాన్ని గుర్తించు. అజ్ఞానాన్ని తొలగించుకో. "**సోఽహం**"- "అదే నేను అయిఉన్నాను" అని తెలుసుకో. ఎలా? "**ధీయోయోనః ప్రచోదయాత్**" - నీ బుద్ధిని ప్రేరేపించి నీలో అజ్ఞానాన్ని తొలగించుకో.

అర్జునుడు జన్మ జన్మల వాసనలతో కూడి ఉండి మోహంలో పడి నిర్వేదానికి గురి అయ్యాడు. జగద్గురువైన శ్రీకృష్ణుడు గీతోపదేశం చేసిన తరువాత, "**నష్టో మోహః స్మృతిర్లబ్ధ్వా**" -" హే కృష్ణా! నీ అనుగ్రహం వలన నా అజ్ఞానం నశించింది. నా సంశయాలు తీరాయి" అంటాడు. అజ్ఞానం నుండి బయటపడాలంటే "**సోఽ హం భావేన పూజయేత్**" " అదే నేను" అనే భావన కలిగి ఉండు అని చెబుతోంది స్కందోపనిషత్తు. భగవద్గీతలో -

**ధ్యాయతో విషయాన్పుంసః, సంగస్తేషూపజాయతే ।**

**సంగాత్సంజాయతే కామః,కామాత్క్రోధో ఽ భి జాయతే ॥**

**క్రోధాద్భవతి సమ్మోహః, సమ్మోహాత్స్మృతి విభ్రమః ।**

**స్మృతి భ్రంశాద్బుద్ధినాశో బుద్ధి నాశాత్ప్రణశ్యతి ॥ భ.గీ 2/62,63**

విషయ చింతన వలన, విషయములందాసక్తి జనించి దానియందు కోరిక కలుగుతోంది. ఆ కోరిక తీరకపోతే కోపము, కోపము వలన అవివేకము, అవివేకము వలన మరపు, మరపు వలన బుద్ధి నాశము, బుద్ధి నాశము ద్వారా పూర్తిగా చెడినవాడవుతున్నాడు.

నీలో ఉన్న "తాను"ను (సత్యాన్ని) గుర్తించే ప్రయత్నం చెయ్యి. శ్రీ గురుదేవులు సమర్థులు. మనం చేసే ప్రయత్నం మనం చేస్తే వారు మనలను గమ్యానికి తప్పకండా చేరుస్తారు. మనలోని అరిషడ్వర్గాలు (కామ క్రోధాదులు) పోవాలంటే సత్సాంగత్యం చేస్తూ నిస్సంగులమవ్వాలి. నిస్సంగత్వం నిర్మోహానికి, నిర్మోహం నిశ్చలతత్వానికి, నిశ్చలతత్వం జీవన్ముక్తికి దారి తీస్తుంది.

మనస్సును విషయ వాసనలలో నుండి మరల్చి భగవంతుని వైపు తిప్పాలి. తీవ్రంగా సాధన చేస్తే ఈ జన్మలోనే తప్పకుండా గమ్యం చేరుతాం. అన్యథా ఉత్కృష్టమైన మానవ జన్మను వృథా చేసికొన్న వారమవుతాము. ఫలితం పునర్జన్మ. "మళ్ళీ మానవజన్మ వస్తుందనే గ్యారంటీ లేదు" - ఇది శ్రీ గురుదేవుల మాట.

కాబట్టి భగవంతుని నిరంతరం ధ్యానం చేసి మన జన్మలను పునీతం చేసికోవాలి. అట్టి శక్తిని, భక్తిని, సాధనా సంపత్తిని శ్రీ గురుదేవులు మనందరికీ ప్రసాదించెదరు గాక! సుఖీభవ!


జ్ఞానరత్నం
మధుప
పిల్లలూ! ఈ డబ్బులు తీసుకొని జాగ్రత్తగా వెళ్లి బజారులో సరుకులు తీసుకురండి.
1
తమ్ముడూ! నా చెయ్యి గట్టిగా పట్టుకో. లేకపోతే తప్పిపోతావ్.
అలాగే అన్నయ్యా!
2



అన్నయ్యా! పద, ఆ గదిలో ఏముందో చూద్దాం.
3
ఈ మ్యూజిక్ బలే ఉంది కదా!
మనకి పనుంది పద తమ్ముడూ!
4



అన్నయ్యా! ఇదెక్కుదాం దా!
నాన్నగారు చెప్పిన మాట మరిచిపోయావా? పద, పద.
5




అరె! ఈ జోకర్లు ఎంత బాగున్నారో!
6


అయ్యయ్యో! ఈ
సందర్భంలో మన
జేబులో డబ్బులు
ఎవరో కొట్టేసారు.
ఇప్పుడెలా?
7


మన తండ్రియైన
భగవానుడు మనకు
కూడా ఇలాగే
జ్ఞానరత్నాన్ని ఇచ్చి
ఈ ప్రపంచమనే
బజారుకు పంపాడు.
మనం కూడా ఈ
మాయా
ప్రపంచంలో పడి
మనలోనే ఉన్న
ఆరుగురు దొంగల
చేతిలో ఆ
జ్ఞానరత్నాన్ని
పోగొట్టుకుంటు
న్నాం.
8

# శ్రీ కృష్ణం వందే జగద్గురుమ్

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

శ్రీకృష్ణపరమాత్మ జననీ జనకులైన దేవకీవసుదేవుల వివాహానంతరం దేవకీదేవి సోదరుడు కంసుడు వారిని మెట్టినింటికి సాగనంపడానికి పరమానందముతో రథ సారథ్యం చేశాడు. కంసుడు ఆనందపారవశ్యముతో రథసారథ్యం చేస్తుండగా, మాయా మానుష విగ్రహుడు, లీలామానుష స్వరూపుడైన శ్రీకృష్ణ పరమాత్మ ఆకాశవాణి ద్వారా కంసుని జీవితంలో అనూహ్యమైన మార్పు తెచ్చాడు. ఆ దివ్యవాణి 'దేవకీ వసుదేవుల అష్టమ సంతానం కంసుని సంహరిస్తాడ'ని హెచ్చరిక చేస్తుంది. వెంటనే కంసుని ప్రవర్తనలో వూహించని మార్పు వచ్చింది. ఆకాశవాణిని వినగానే ఆనందంతో ఉర్రూతలు ఊగుతున్న కంసుని మనస్సు ఒక్కసారిగా ఆవేదన, ఆగ్రహావేశాలకు లోనైంది. తన వునికిని తానే మరచిపోయి శోక సముద్రంలో మునిగి పోయాడు. దేవకీ వసుదేవులను చెరసాలలో బంధించాడు. కంసుని మృత్యుభయమెంత విహ్వలునిగా మార్చినదో తెలుస్తుంది. ఆకాశవాణి 'దేవకి వసుదేవుల అష్టమ సంతానముచే సంహరింపబడతావు' అని ఆదేశించిందంటే భగవంతుడు దయామయుడు కనుకనే కనీసం పది సంవత్సరాలు ఆయుర్దాయం ప్రసాదించి, ఆ సమయంలో కంసుని జీవితాన్ని సంస్కరించుకోవడానికి అవకాశం ప్రసాదించాడు. కాని, ఆ కాలాన్ని సద్వినియోగం చేసుకుని, తరించకుండా క్షణ క్షణం మృత్యు భయంతో కృంగి కృశించిపోయాడు.



జీవితంలో ప్రతి సంఘటన భగవత్త్రణాళిక ప్రకారమే జరుగుతుంది. దానిని ఎవరూ మార్చలేరు. దేవకీదేవికి అష్టమ

సంతానంగా శ్రావణ బహుళ అష్టమినాటి అర్ధరాత్రి కృష్ణపరమాత్మ ప్రభవించాడు. భువియందు అవతరించక ముందే, తన విభూతిని ప్రదర్శించిన ప్రేమావతారము శ్రీకృష్ణ భగవానునిది. ఆ మాయామానుష మూర్తి అవతరించినది మొదలు, ఎన్నో అద్భుతాలను ప్రదర్శించాడు. చెరసాలలో ఉద్భవించి తన జననీ జనకుల చెరకు స్వస్తి పలికాడు. తాను అవతరించిన మరుక్షణమే చతుర్భుజుడు, కౌస్తుభమణిధారి, ఆజానుబాహుడు అరవింద దళాయతాక్షుడైన శ్రీమన్నారాయణ మూర్తిగా దర్శనమిచ్చి, వారిని ఆనందాంబుధిలో ఓలలాడించాడు. మరుక్షణమే తన జనకునకు ఆదేశమిచ్చాడు. 'తనను పసిబిడ్డగా చెరసాల నుండి తీసుకు వెళ్ళి, యమునానదిని దాటి, నంద గోకులానికి వ్రేపల్లెకు తీసుకువెళ్ళి, అక్కడ అప్పుడే ప్రసవించిన యశోదమ్మతల్లి ప్రక్కన పడుకోబెట్టి, ఆవిడ పొత్తిళ్ళలోని పసిపాపను తీసుకుని తిరిగి యమునానదిని దాటి చెరసాలకు చేర్చ'మని ఆదేశించాడు.

ఈ సందర్భంలో కృష్ణపరమాత్మ(Child is Father of Man) పసిబిడ్డయే మానవునికి తండ్రియనే సత్యానికి తార్కాణము. చెరసాల వాకిళ్ళు వాటంతట అవే తెరుచుకున్నాయి. యమునానది సంతోషముతో దారి యిచ్చింది. అలాగే నందుని గృహ ద్వారాలు కృష్ణపరమాత్మను ఆహ్వానిస్తూ, వాటికవే తెరచుకున్నాయి. వసుదేవుడు శ్రీమన్నారాయణుని ఆదేశానుసారము పొత్తిళ్ళలోని పసిపాపను ఎత్తుకుని తిరిగి వెనక్కి వెళ్ళాడు. దేవకీవసుదేవుల మహద్భాగ్యము పరమాత్మకు జన్మనిచ్చేవరకే. కాని ముద్దులు మూటలు కట్టే, ముద్దుబిడ్డ బాలకృష్ణుని బాల్యలీలలు, మహిమలు చూసే మహద్భాగ్యమంతా నందయశోదలదే.

కృష్ణ పరమాత్మ శ్రావణ మాసములో అవతరించడములో ఒక పరమార్థమున్నది. శ్రావణ మాసము శ్రవణానికి అత్యంత ప్రధానమైనది. శ్రవణము మననము, నిదిధ్యాస, తితీక్ష, శ్రద్ధ, సమాధానములకు దారి తీస్తుంది. శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీత ద్వారా చేసిన గీతోపదేశము ఒక్క అర్జునుని కొరకే కాదు. అందుచేతనే పార్థుని గోవత్సముతో పోల్చారు. గోక్షీరములు గ్రోలిన వెంటనే సర్వోపనిషత్సారమైన గీతామృత క్షీర ధారలు సర్వ మానవాళిపై వర్షించి తరింపజేశాయి.

-సశేషం

# విష్ణుచిత్తుడు - గోదాదేవి

- మురళి

శ్రీ విష్ణుచిత్తులు ఇప్పటి తమిళనాడులోని శ్రీ విల్లిపుత్తూరులో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. వీరికి భట్టనాధులనీ, పెరియాళ్వారు అని పేర్లు. పెరియాళ్వారు అనగా పెద్ద ఆళ్వారు అని అర్థం. ఈ పెద్దతనం వయస్సులోగాని, కులంలోగాని కాదు, భగవదనుభవంలో. చిన్నతనం నుంచి పూలతోటలను, తులసి వనాలను పెంచి, వాటితో మాలలు అల్లి భగవంతునికి అర్పించటమే జీవిత లక్ష్యముగా ఎంచుకుని, కాలాన్ని సద్వినియోగ పరచుకొన్న పరమ పావనమూర్తి. ఆ మాలలను నిత్యమూ శ్రీరంగనాధునికర్పిస్తూ, భక్తి పారవశ్యంతో జీవితాన్ని గడిపిన భక్తశిఖామణి.

ఒకరోజు శ్రీరంగనాధుడు దర్శనమిచ్చి, 'వల్లభదేవుడనే పాండ్య రాజు పెద్ద సభను ఏర్పాటుచేసి, పరమపద మార్గాన్ని నిరూపించ వలసినదిగా కోరాడు. అనేకమంది పండితులు నానా దేశాల నుండి వచ్చి, వారి పాండిత్యాన్ని చూపిస్తూ వాదప్రతివాదనలు చేస్తున్నారు. నీవు ఆ సభకు వెళ్ళి పరమపద మర్గాన్ని నిర్ణయించు' అని ఆజ్ఞాపించాడు.

విష్ణుచిత్తుడు చేతులు జోడించి, 'ప్రభూ! నేను పరమపద నిర్ణయం చేయడమా! శాస్త్రాలంటే ఏమిటో తెలియదే! ఏనాడూ గ్రంథం పట్టిన చేతులు కావివి. తోటలో పని చేసుకుంటూ, చెట్లకు నీరు పెట్టుకుంటూ నీకు పుష్పమాలలు సమర్పించడం తప్ప నాకేమీ తెలియదే! ఇంతకంటే నాకు తెలియనక్కర్లేదు కూడా కదా ప్రభూ! నేనా తమకు దొరికినది, పరమ పదాన్ని నిర్ణయించడానికి?' అని ప్రార్థించాడు.

కానీ పరమాత్మ వదలలేదు. 'భక్తాగ్రేసరా! పండితులంటే కేవలం గ్రంథాలు వల్లించి, అప్పచెప్పగలగడమా? ఒక్కొక్క శ్లోకానికి 40 అర్థాలు చెప్పగలగటమా? కేవలం నిష్కల్మషమైన భక్తి కలిగినవారికే పరమ పద మార్గము నిర్ణయించగల ప్రతిభ వుంటుంది. భయపడకు. నీ ద్వారా సర్వమూ నేనే నెరవేర్చుకోగలను. ఇందుకు నీవే అర్హుడవు' అన్నాడు.

విష్ణుచిత్తుడు భగవంతుని ఆజ్ఞను శిరసావహించి, రాజసభకు వెళ్ళి, తన వాదనలతో శాస్త్రవేత్తలందరినీ జయించాడు. విష్ణు సేవయే మోక్షానికి మార్గమని వివరిస్తూ, వివిధ చారిత్రక, మరియు వేదోపనిషత్ లను వుటంకించారు. వీరి వాదనలకు సర్వత్రా ఆమోదం లభించడమే కాక, రాజు కూడా ఆమోదించి, విష్ణుచిత్తులను మధురై పుర వీధులలో ఊరేగించి, సత్కరించాడు. విష్ణుచిత్తులు భగవానుని ఆదేశాన్ని పాలించ

గలిగినందుకు అమితానందపడ్డారు. శ్రీరంగనాధుడే స్వయంగా వచ్చి తనతో వాదనలు చేయించిన అనుభూతిని పొందారు. అనంతరం విష్ణుచిత్తులు తిరుపల్లాండు రచించారు. ఇవి నాలాయిర దివ్య ప్రబంధం లోని మొదటి 12 శ్లోకాలుగా చెప్పబడుతున్నవి. విష్ణుచిత్తులు వైష్ణవ మతాన్ని విరివిగా ప్రచారం చేశారు. వీరు దక్షిణ భారత దేశంలోని 12 మంది ఆళ్వార్లలో మొదటివారు.

జనకమహారాజుకు యజ్ఞవాటికలో సీతాదేవి లభించినట్లే విష్ణుచిత్తునకు తులసివనంలో గోదాదేవి లభించింది. చిన్నతనం నుండి తండ్రి దగ్గర భగవద్విషయాన్ని చక్కగా శ్రవణం చేసి, ఆచరించింది. పర్యవసానంగా పరిపూర్ణంగా ఘనీభవించిన భగవద్భక్తి స్వరూపముగా పరిణతి చెందింది. చివరకు తనకు భర్త శ్రీరంగనాధుడే గాని, వేరెవ్వరూ కారని నిర్ణయించుకుని, తండ్రిగారికి తన నిర్ణయం చెప్పింది. ఒక మానవునితో వివాహం అన్నంత మాత్రానే తన ప్రాణాలు నిలువని స్థితికి చేరింది. గోపికలనే ఆదర్శంగా పెట్టుకుని, శ్రీరంగనాధుడే తనకు భర్త కావాలని వ్రతం చేసింది. తానే ఒక గోపికగా మారిపోయింది. ఆ వ్రతం ముప్పది రోజులు. ముప్పది రోజులూ ముప్పది పాశురాలు చెప్పి, తాను గోపిక వలెనే ప్రవర్తిస్తూ, ఇతర బాలికలను గోపిలకవలె భావన చేస్తూ, ఈ వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో చేసింది. వ్రతము పూర్తి అయ్యేసరికి ఈమెను శ్రీరంగానికి పిలిపించుకుని శ్రీరంగనాధుడు ప్రత్యక్షంగా వివాహం చేసుకుని తన విమానంలో తీసుకుని వెళ్ళాడు.

గోదాదేవి ఆచరించిన వ్రతమునే ఇప్పుడు 'ధనుర్మాస వ్రతం'గా భక్తి సంప్రదాయంలో ఆచరిస్తున్నారు. ఆ వ్రత సమయంలో గోదాదేవి చెప్పిన ముప్పది పాశురాలే 'తిరుప్పావై' ప్రబంధము. ఈ దివ్య ప్రబంధానికి ఎన్నో భావార్థాలు వున్నాయి. ఇది నాలాయిర ప్రబంధములలో కెల్ల గొప్పది. ఈ పాశురముల అర్థము, అంతరార్థము భక్తిశ్రద్ధలతో విన్నవారు పురుషోత్తముడైన పరమాత్మను అనుభవించగలరనుట అతిశయోక్తి కాదు. నమ్మాళ్వారు మొదలైనవారంతా ఈ ప్రబంధముతో పరమాత్మను అనుభవించారు. గోదాదేవి నుండి వెలువడిన మధురాతి మధురమైన కవితాస్రవంతి 'తిరుప్పావై' . దక్షిణ భారతదేశంలోని 12మంది ఆళ్వార్లలో గోదాదేవి కూడా ఒకరు. ప్రపన్నులందరూ ఈ ప్రబంధాధ్యయనము చేసి దివ్యానందమును పొంది తరించెదరు గాక!!

# గుర్వష్టకమ్

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీప్రసాద్ (అమెరికా)

**శరీరం సురూపం తథావా కళత్రం**
**యశశ్చారు చిత్రం ధనం మేరుతుల్యం।**
**గురోరంఘ్రి పద్మే మనశ్చే న లగ్నం**
**తతః కిం తతః కిం తతః కిం తతః కిం॥**

'సుందరమైన రూపము, అందమైన జీవితభాగస్వామి, నలుదిశలా వ్యాపించిన కీర్తి, మేరు పర్వతముతో సరితూగే ధనము - ఇవన్నీ వున్నప్పటికీ గురుపాదపద్మముల యందు మనస్సు నిలుపలేక పోయినప్పుడు వాటి విలువ శూన్యమే' అని ఈ శ్లోక తాత్పర్యము. గురు అష్టకములోని ఈ మొదటి శ్లోకము మిగతా శ్లోకాలన్నిటికీ ఆయువు పట్టుగా నిలచి, వాటి సారాంశాన్ని సంక్షిప్తంగా వివరిస్తోంది.

గురుపాదము దొరకటము ఎంత అదృష్టమో వివరించడమే కాక, ఆ పాదద్వయము మీద మనస్సు లగ్నం చేయడం కూడా అంతే అవసరమని ఈ శ్లోకం సూచిస్తోంది. అలా మనసు లగ్నం చేయగలగడమే ధ్యానము. సాధకుడు నిరంతర గురుపాద ధ్యానమును మరువకూడదన్న శంకరుల హెచ్చరిక ఈ అష్టకంలో ధ్వనిస్తోంది.

మరికొంత లోతుగా పరిశీలిస్తే, ఈ శ్లోకంలో మరొక అర్థం కూడా స్ఫురిస్తుంది.

**శరీరం సురూపం** - ఎప్పటికీ మార్పు చెందని జగన్మోహనమైన సుందర ఆకారం. అది కేవలం దివ్యమంగళ మూర్తి అయిన శ్రీమన్నారాయణుడిదే కదా! ఎందుకంటే జగత్తులోని మిగిలిన సుందరాకారాలన్నీ మార్పుచెంది నశించేవే.

**తథావా కళత్రం** - సౌందర్యంలో శ్రీమహావిష్ణువుతో సరితూగ గలిగినది అమ్మ శ్రీమహాలక్ష్మియే కదా. మొదటి పాదం ఇలా లక్ష్మీనారాయణులను సూచిస్తోంది.

**యశశ్చారు చిత్రం** - శ్రీమన్నారాయణుడిని ఆశ్రయించినవారికి నలుదిశలా వ్యాప్తిచెందే అశేషమైన కీర్తి కలుగుతుంది.

**ధనం మేరు తుల్యం** - లక్ష్మీ కటాక్షం కలిగినవారికి మేరుపర్వత తుల్యమైన

ధనం సమకూరడం సహజమే కదా. ఇలా రెండవ పాదం లక్ష్మీనారాయణులను పూజించడం వలన కలిగే కీర్తిని, ఐశ్వర్యాన్ని సూచిస్తోంది. మిగిలిన రెండు పాదాలతో కలిపి విశ్లేషించుకుంటే, 'గురు పాదము మీద మనస్సు నిలిపిన వారికి భోగభాగ్యాల గురించిన చింత అవసరం లేదనీ, గురుకృపచే అవి సహజంగానే సమకూరుతాయనే భావనను తెలియజేస్తుంది. అలా గురుపాదముల పైన మనస్సు నిలుపలేని వాని జీవితం వ్యర్థము.

శ్రీబాబు తమ బోధలో 'లక్ష్మీ నారాయణుల పాదపద్మాలను సేవించినవారికి ఇటు ఇహలోక దరిద్రము, అటు పరలోక దరిద్రము కూడా తీరుతవి. ఇహంలో సకలసంపదలను అందిస్తాడు, పరంలో మోక్షసామ్రాజ్య పదవిని అందజేస్తాడు' అనేవారు.

అలాంటి మేరుధీరుడైన సద్గురు పాదపద్మముల యందు మనసు లగ్నం చేయటమే సాధకులయిన మనందరి లక్ష్యమని ఈ శ్లోకం యొక్క అంతరార్థం.

-సశేషం

భగవంతుడు అవతారం దాల్చినప్పుడు మానవుని వలె ప్రవర్తిస్తాడు. సగుణ, నిర్గుణ రహితమైన ఆత్మవస్తువు సగుణంగా దర్శనమిస్తే నమ్మలేరు

..... మానవుడు దేవుడెలా అవుతాడు? అని తలపోస్తారు. .... పోనీ నిర్గుణంగా దర్శనమిస్తే కనబడని వస్తువును గురించి అసలే నమ్మరు. మరి ఇంక ఎలా?

- శ్రీ బాబూజీ మహరాజ్

## రామలక్ష్మణులది విడదీయరాని బంధం

- గాలి జగదీశ్

ఒక నాటి రాత్రి రామలక్ష్మణులతో కలసి విశ్వామిత్రుడు జనకపురి ఉద్యానవనంలో విశ్రమిస్తుండగా, రామ లక్ష్మణులు ఆ మహర్షి సేవ చేస్తున్నారు. మహర్షి నిదురించాక, రాముడు పడుకొన్నాడు. లక్ష్మణుడు రాముని పాద సేవ చేస్తూ దుఃఖపడుతూ, 'ఈ పాద సేవా భాగ్యము నా కెంత కాలమో? మా వదిన రాకతో ఇవి నాకు కాకుండా పోతాయేమో!' అని చింతిస్తూ కన్నీరు కారుస్తుండగా అవి రాముని పాదములపై పడ్డాయి. రాముడు మేల్కొన్నాడు. 'లక్ష్మణా! దేనికా దుఃఖము?' అని అడిగాడు. లక్ష్మణుని ద్వారా విషయము నెరిగి, 'నాయనా! నీవు లేనిదే నేను కూడా బ్రతకలేను. నీ కొరకు నేను భార్యను కూడా త్యజించగలను' అని చెప్పి లక్ష్మణుని హృదయానికి హత్తుకున్నాడు.

అందుకేనేమో మొదటిసారిగా శ్రీరాముడు రావణుని ద్వారా సీత అపహరింపబడి లక్ష్మణునితో ఏకాంతంగా గడపటము జరిగింది. రెండవసారి చాకలివాని మాటలు మూలంగా సీతాదేవిని త్యజించినప్పుడు రాముడు ఒంటరిగా తిరిగి లక్ష్మణునితో గడపడము సంభవించింది. భగవంతుని లీలను తెలిసికొనడం ఎవరి తరము!!

### సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా డిసెంబర్ 2019, జనవరి 2020 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***డిసెంబర్ 2019:*** AS 2424, 2994, 6373, 6985, 7196, 7197, 7485, 7619 - 7624, 7625, 7725, 7727, 7728, 7730, 7731, 7745, 7960, 7961.

***జనవరి 2020***: AS 4914, 5426, 6483, 7000, 7003, 7007, 7008, 7009, 7011, 7018, 7019, 7020, 7026, 7027, 7028, 7030, 7031, 7032, 7034, 7037, 7204, 7208, 7431, 7643, 7645, 7964, 7965, 7966, 7968, 7969, 7970,7971, 7972, 7973, 7985

# ఎవరికి తెలియుగ తరమౌను?

- సుశీలా ప్రసాద

చల్లని గాలి వేస్తోంది. తెల్లగా వెన్నెల కాస్తున్నది. పంటచేను మీదుగా కాలిబాటన నడచి వెడుతుంటే గాలి అలలపై తేలివస్తూ, తియ్యని గీతం నా చెవులకి సోకింది. చుట్టూ కలయ చూశాను అది ఎటు నుండి వస్తుందో అని. కొంచెం దూరంలో వున్న తాటాకుల పాకలో నుండి వస్తున్నట్లు గ్రహించాను. మనస్సు కాళ్ళు ఆ పాటకి కట్టుబడి, మెల్లగా అటువైపు అడుగులు వేశాను.

పాక నిండా వెన్నెల వెలుగులు పరచుకుని వున్నాయి. ఆ వెలుగులలో ఒక ముసలి తాత సొరకాయ బుఱ్ఱ వాయించుకుంటూ కనిపించాడు. పరిసరాలేవీ పట్టించుకోకుండా మైమరచి పాడుతున్నాడు. కొంచెం యాసగా వున్న ఆ గీతం వినడానికి మెల్లగా ఆయన దగ్గరకు వెళ్ళి కూర్చున్నాను. అది ఇలా వుంది ...

**1. ఎఱుక గలిగినోడిని, ఎఱ్ఱి మారాజంటూ నరులెంతో నవ్వేరు గురుతు తెలియకను, సత్తెమ్ము సెబితేను ఇనుకోరు పజలు. సావుపుటుక వెన్క సాగిపొయ్యేరు.**

జ్ఞానము కలిగిన జ్ఞాని రూపం చూసి వెఱ్ఱి మారాజు అంటూ జనం గుర్తు పట్టలేక నవ్వుతారు. ఆయన చెప్పే సత్యం జనం వినిపించుకోరు. 84లక్షల జీవరాశులలోను ఉత్కృష్టమైనది మానవ జన్మ వచ్చింది తెలుసుకో అంటే అర్థం చేసుకోక జనన మరణ వలయాలలో చిక్కి పతనమవుతారు.

**2. గుడికట్టి గుడిసుట్టి తిరుగుతుంటావు గుడిలోనివోడు నీ గుండె గుడిలోన కదలక కూసుండి నిన్ను కదిపేడు, నడకలింక సాలించి లోన సూడయ్యా.**

ధనం వున్నవాడిని నీ డబ్బు వృథా చేయకు. నువ్వు నమ్మిన దైవానికి గుడి కట్టించావంటే పుణ్యము, పురుషార్థము కూడా దక్కుతాయి అని మిత్రులంతా సలహాలిస్తారు.

తను కట్టిన గుడికదా అని అతిశయంతో గుడిచుట్టూ తిరుగుతూ ఆ గుడిలో వున్న దైవం, నీ గుండె గుడిలోన కదలక కూర్చుండి నిన్ను కదుపుతున్నాడు అనే యదార్థాన్ని అర్థం చేసుకోడు. **'అంతర్ముఖ సమారాధ్య బహిర్ముఖ సుదుర్లభా'** అనే దైవ నామాన్ని విశ్వసించి ఈ

ప్రపంచంలో తిరుగుళ్ళు మానేసి నడకలిక చాలించవయ్యా. లోపల చూడటం నేర్చుకో.

**3. తెలివిగలవోడినని తెగనీల్గమాకు తెలివి తెల్లారితే సతికిలబడేవు.**

తెలివిగలవాడిననే గర్వంతో విఱ్ఱవీగకు. ఈ ఉపాధి ధర్మం ఏనాడో ఒక క్షణం అంతిమ క్షణం అవుతుంది. అప్పుడా గర్వం అణిగి పోతుంది. శరీరం శాశ్వతంకాదు అని తెలుసుకుని చతికిలపడిపోతావు.

**4. అసలుసిసలు తెలివి ఆ ఒడ్డు సేరే పడవనడిపేటోడి పక్క సేరటమే.**

అసలైన తెలివి ఏదంటే ఈ భవసాగరాన్ని దాటించి, ఆ ఒడ్డు చేర్చే పడవ నడిపేవాడి పక్కన చేరటమే అని గ్రహించు మానవా!

భవసాగర సంతరణ సమర్థుడైన శ్రీసద్గురు స్వామిని ఆశ్రయించి, నీ జీవితం ధన్యం చేసుకో. నీకు వచ్చిన జన్మ సార్థక మవుతుంది అని తాత పాడిన ఈ గీతములోని దివ్యమైన అర్థాన్ని మననం చేసుకుంటూ తిరిగి నడక సాగించాను.

*ఫీజు ఇంత అని చెప్పని వైద్యునికి ఎక్కువ ఫీజు ముట్ట చెబుతాము. అలాగే కోరికలు లేకుండా పూజిస్తే, అప్పుడు భగవంతుడు మనకు అన్నీ అధికంగానే ప్రసాదిస్తాడు.*

*నిశ్చలమైన నీటిలో చంద్రుడు చక్కగా కనిపించినట్లు, సంకల్ప రహితమైన మనస్సులో భగవంతుడు అతి స్పష్టంగా భాసిస్తాడు.*

*భగవానుడు మనకీ జన్మను ప్రసాదించినది ఆయనను తెలుసుకొనటానికి గానీ, మూడుసార్లు భుజించి, ఆరుసార్లు బహిర్భూమికి వెళ్ళటానికి కాదు.*

- శ్రీ బాబూజీ మహరాజ్

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**డిసెంబర్ 2019**

2 సోమ - శ్రీసుబ్రహ్మణ్య షష్ఠి.

3 మంగళ - శ్రీగురుదేవులు స్వస్వరూపలయం పొందిన తేదీ - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

7 శని - గీతాజయంతి. భగవద్గీతా పారాయణ, శ్రీసద్గురుపాదపూజ.

11బుధ - మార్గశిర పౌర్ణమి, దత్తజయంతి - శ్రీ సద్గురుపాదపూజ.

16 సోమ - శ్రీధనుర్మాస వ్రత ప్రారంభం.

21 శని - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

24 మంగళ - మాసశివరాత్రి

25 బుధ - క్రిస్టమస్ - శ్రీ సద్గురుపాదపూజ.

26 గురు - అమావాస్య. సూర్యగ్రహణం (ఉ॥ 8-12ని॥ నుండి 11-22ని॥ వరకు)

**జనవరి 2020**

1 బుధ - ఆంగ్ల సంవత్సరాది. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

6 సోమ - ముక్కోటి ఏకాదశి. ఉత్తరద్వార దర్శనం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

10 శుక్ర - పుష్య పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ.

14 మంగళ - భోగి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 7గం.లకు శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

15 బుధ - సంక్రాంతి - పుష్య బహుళ పంచమి - శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

16 గురు - కనుమ

19 ఆది - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

23 గురు - మాస శివరాత్రి

24 శుక్ర - అమావాస్య

30 గురు - వసంత పంచమి

# అద్దాల గది

- పాలూరి కాళీ ప్రసాద్

ఒక చోట ఒక అద్దాల గది వుంది. ఆ గది గోడలన్నీ రకరకాల అద్దాలతో చేసినవే. ఒక అద్దం మనలను పొడవుగా చూపిస్తే, మరొక అద్దం పొట్టిగా చూపిస్తుంది. ఒకటి లావుగా చూపిస్తే, మరొకటి సన్నగా చూపిస్తుంది. ఒకటి వికృతంగా చూపిస్తే, మరొకటి తలక్రిందులుగా చూపిస్తుంది. ఇలాంటి గదిలోకి ఒక కుక్క ప్రవేశించింది. ఎటు చూసినా రకరకాల ఆకారాలలో అనేక కుక్కలు కనిపించాయి. భయమేసి గట్టిగా మొరిగింది. ప్రతిగా అవి కూడా మొరిగాయి. తాను బయటకు తప్పించుకునే మార్గం కనబడలేదు. ఇక తెగించి ఆ కుక్కలపై దాడి చేసి, ఆ అద్దాలన్నింటినీ పగులగొట్టేసింది.

అదే గదిలోకి ఒకచిన్నపిల్లవాడు ప్రవేశించాడనుకోండి. అందులో రకరకాలైన విచిత్ర ఆకృతులలో కనబడుతున్న తన రూపాన్ని చూసుకుని, ఒకసారి సంతోషానికి, మరొకసారి విషాదానికి, భయానికి, కోపానికి ఇలా రకరకాల భావోద్వేగాలకు గురవుతాడు. పెద్దవాళ్ళు ఎవరైనా వచ్చి తనను ఇక్కడి నుండి తప్పిస్తే బాగుండును అని ఆరాటపడతాడు. అదే బుద్ధి వికసించిన ఒక పెద్దమనిషి ప్రవేశించాడనుకోండి. ఏం చేస్తాడు? ఎటువంటి మనో వికారానికి లోనుకాకుండా, తననే వివిధ రూపాలలో చూపిస్తున్న ఆ అద్దాల ప్రతిభను మెచ్చుకుంటూ, తన ఇష్టం వచ్చినంతసేపు అక్కడ వుండి ఆనందంగా గడిపి, ఎప్పుడు కావాలంటే అప్పుడు తలుపు తీసుకుని బయటకు వెళ్ళిపోతాడు.

మన చుట్టూ వున్న ఈ ప్రపంచం కూడా ఈ అద్దాల గదిలాంటిదే. అందులో మనకు మిత్రులుగా, శత్రువులుగా, బంధువులుగా, పక్షులుగా, జంతువులుగా, వృక్షాలుగా, వివిధ వస్తువులుగా కనిపించేవన్నీ మన ప్రతిబింబాలే. వాటికీ మనకూ ఎటువంటి తేడా లేదు. వస్తుతః చూసుకుంటే అవన్నీ పంచ భూతాలతో నిర్మితమైనవే. కొంచెం లోపలికి వెడితే అన్నింటిలోనూ వుండి, అన్నింటినీ ప్రకాశింపజేసే ఆత్మవస్తువు కూడా ఒకటే. బంగారంతో వివిధరకాల వస్తువులు చేస్తారు. అది తలమీద పెట్టుకునే కిరీటం కావచ్చు, లేదా కాలికి పెట్టుకునే అందె కావచ్చు. కానీ అది నీకు కావాలంటే అందులో ఎంత బంగారం వున్నదో, ఈ రోజు బంగారం ఎంత ధర వుందో, దాని బట్టి లెక్కకట్టి నీకు ఆ వస్తువు అమ్ముతారు. అంతేకాని, కిరీటం అయినందువల్ల ఎక్కువ ధర, కాలిపట్టీ అయినందువల్ల తక్కువ ధర అని వుంటాయా?

అయినా మనం ఈ అద్వైతాన్ని గుర్తించక, ఆ అద్దాల గదిలోని బాలుడిలాగా రకరకాల భావోద్వేగాలకు గురవుతున్నాం. రాక్షసులవంటి కొందరైతే ఆ కుక్కలాగా ఈ ప్రపంచాన్నే నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. నిజానికి మనకు ఒకరిని చూస్తే ప్రేమ, మరొకరిని చూస్తే ద్వేషం కలుగుతాయి. కాని, దానికి కారణం మన మనస్సే తప్ప అవతల వారు కాదు కదా! కారణం అవతలి వారే అయితే, నువ్వు ప్రేమించే, గౌరవించేవారికి నీ పట్ల ద్వేష భావం, చులకన భావం ఎలా కలుగుతున్నాయి? నువ్వు ఎంతో ద్వేషించేవారికి నిజానికి నీపట్ల ఎంతో ప్రేమ భావన వుండి వుండవచ్చు కదా. పోనీ మనుషులను ప్రక్కకు పెట్టినా, నీకు ఎంతో ఇష్టమైన ఆహార పదార్థానికి నీపట్ల ఎటువంటి భావనా వుండటం లేదు కదా. అంటే ఈ భావోద్వేగాలన్నింటికీ మన మనస్సే కారణం కాని, ఎదుటి వ్యక్తో, లేక వస్తువో కాదన్నమాట.

ఇంకా ఒకే వస్తువును లేదా వ్యక్తిని వివిధ సందర్భాలలో చూసినప్పుడు నీకు విభిన్నమైన భావనలే కలుగుతున్నాయి కదా. మామూలుగా తీపి అంటే ఇష్టం వున్నవాడు కూడా జ్వరం వచ్చినప్పుడు అదే తీపిని చూస్తే వాంతి చేసుకుంటాడు. అలాగే తాను ఆనందంగా వున్నప్పుడు తన పిల్లవాడిని ఒడిలో కూర్చోబెట్టుకున్న వాడే, పని వత్తిడిలో వున్నప్పుడు అదే పిల్లవాడిని అవతలకి తోసివేస్తాడు. అంటే ఇక్కడ వివిధ భావోద్వేగాలు కలిగించే ఆకారాలన్నీ నీ మనస్సనే అద్దంలోని లోపాల వల్ల వికృతాకారంగా కనిపించే వికృత రూపాలన్నమాట. అందుకే శ్రీ పరిమి సుబ్రహ్మణ్య భాగవతార్‌వారు **'నీవు చూచునదెల్ల నీవయే యను తత్వమసి వాక్యమున కర్థమ్ము నిజము'** అన్నారు.

పై ఉదాహరణలో కుక్కకి, పిల్లవాడికి కనిపించినట్లే బుద్ధి వికసించిన పెద్దమనిషికి కూడా వివిధ వికారాలతో తన ప్రతిబింబాలు కనిపించాయి. అయితే అతడు ఇవన్నీ తన స్వరూపాలేనని, ఇందులో కనిపిస్తున్న వికృతాలన్నీ నిజానికి అద్దాలు చేస్తున్న మాయయే తప్ప అక్కడగాని, తనలోగాని ఎలాంటి వికృతి లేదని గుర్తించి, ఆ గదిలో వున్నంతకాలం హాయిగా ఆనందంగా వున్నాడు. అలాగే జ్ఞాని కూడా మనకు కనిపించినట్లే సృష్టిలోని వైవిధ్యం ఆయనకు కనిపిస్తున్నా, ఇదంతా కేవలం ఉపాధి స్వభావాలలోని వ్యత్యాసం వలన వచ్చినది తప్ప అసలు తత్త్వంలో వున్నదంతా తానేననే జ్ఞానం కలిగి నిశ్చింతగా, ఆనందంగా వుంటాడు.

(గత సంచిక తరువాయి) 

# కైవల్యోపనిషత్

- రేఖ

ఒక గురువుగారు ఒక శిష్యుడికి ఒక జల్లెడ ఇచ్చి, ఆ జల్లెడతో నీటిని పట్టుకు రమ్మన్నారు. జల్లెడతో నీరు పట్టుకురాగలమా? కానీ గురువుగారు శాసించారు. ఎలాగైనా సరే జల్లెడతో నీరు తీసుకు రావలసినదే. గురు వాక్యాన్ని పాటించవలసినదే.

ఇక్కడ గురుబోధపైన విచారణ ఉపయోగపడుతుంది. ఆ శిష్యుడు ఆలోచిస్తున్నాడు. ఇప్పుడు ఆ జల్లెడలోని రంధ్రాలు నిండాలి, పూడుకోవాలి. ఈ శిష్యుడు సత్సంగంలో పాల్గొని వున్నాడేమో, అతను ఏం చేశాడంటే, ఆ జల్లెడని ఒక నదిలో పడవేసి వుంచాడు. ఆ నీళ్ళు ఆటు పోటులకి ఆటు ఇటు పారి, మట్టి అటు వెళ్ళి. ఇటు వెళ్ళి ఆ జల్లెడలోని రంధ్రాలన్నీ పూడుకుపోయాయి. అప్పుడు ఆ శిష్యుడు ఆ జల్లెడతో నీరు పట్టి గురువు గారి దగ్గరకు వెళ్ళాడు.

మనం కూడా అలా చేయగలం. కొంతమంది ఏవేవో కారణాలు చెబుతారు - వయస్సు మళ్ళిందనో, విన్నది గుర్తుండటం లేదనో, లేక మనసు నామం మీద నిలబడటం లేదనో అంటారు. 'నవరంధ్రాలతో కూడిన ఈ దేహం, జన్మ జన్మల నుంచి వాసనలతో కూడిన మనసు లోని వాసనలు ఒక్కసారితో పోవాలంటే పోతాయా!' అని శ్రీగురుదేవులు అంటూ వుండేవారు.

కానీ వాసనలు పోకుండా వుండవు. మనసు మారకుండా వుండదు. ఈ నవరంధ్రాలతో కూడిన ఉపాధిని సత్సంగంలో కూర్చోబెడు తున్నాము. ఎటు చూసినా మహాత్ములో, లేక ఎదురుగుండా భగవంతుడో కనిపిస్తారు. ఇంకోవైపు చూస్తే తోటి సత్సంగీయులు ఎంతో ఆవేదనతో, తత్త్వాన్ని ఆర్జించుకోవాలని, తత్త్వ స్వరూపాన్ని జుర్రుకోవాలని, తీవ్ర ఆవేదనతో వున్నారు. చెవికి ఆ బోధ వినిపిస్తోంది. నాలిక భగవన్నామమే అంటోంది. తినడానికి భగవత్ప్రసాదమే లభిస్తోంది. అహర్నిశలూ ఈ నవరంధ్రాలతో కూడిన దేహాన్ని ఇక్కడ, ఇటువంటి వాతావరణంలో పడేసి వుంచితే, జల్లెడలోనే నీళ్ళు పట్టగాలేనిది, మనసు మన వెంట వచ్చి, ఈ జీవితంలోనే మనం తప్పక ఆ దివ్య భగవత్తత్త్వాన్ని గుర్తించ గలుగుతాము. మహాత్ములు ప్రసాదించిన ఈ సత్సంగాల్లో

పాల్గొంటే ఎంతో లబ్ధిని పొందుతాము.

ప్రపంచంలో పొందేవాటిల్లో లాభ నష్టాలు రెండూ వుంటాయి. ఇక్కడ వచ్చి కూర్చుంటే అంతా లాభమే. ధనం ఖర్చుపెట్టిన కొద్దీ నష్టం వుంది, తరిగిపోతుంది. కానీ భగవన్నామం అన్నకొద్దీ ఇంకా పెరుగుతుంది. భగవత్తత్త్వం విన్నకొద్దీ మనశక్తి పెరుగుతుంది. ఇక్కడంతా లాభమే కాని నష్టమనేది తొంగి చూడటానికి కూడా వీలులేదు' అని శ్రీమాతాజీ తమ బోధలో అందించారు.

-సశేషం

## మోక్షం లిస్టులో

ఒక అడవిలో ఒకడు ఏకాంతంగా తపస్సు చేసుకుంటున్నాడు. తల క్రిందపెట్టి, కాళ్ళు పైకిపెట్టి, మండుటెండలో శరీరమును తపింప జేస్తూ, తాను ఒక గొప్ప తపస్వినని, ఘనకార్యమును ఆచరిస్తున్నానని భావిస్తూ, అహం భావాన్ని కలిగి వున్నాడు.

ఒకరోజు ఆకాశ మార్గంగుండా ఒక గంధ్వరుడు వెళ్ళడం ఈ తాపసి చూసి, అతన్ని దగ్గరకు రమ్మనమని కేకవేశాడు. 'మీరు ఎక్కడకి వెడుతున్నారని ప్రశ్నించాడు. వైకుంఠానికి వెడుతున్నానని ఆ గంధర్వడు సమాధానం చెప్పాడు. ఈ తాపసి అతనికి నమస్కరించి, 'అయ్యా! గంధర్వా! మోక్షార్హత కలిగినవారి యొక్క లిస్ట్ వైకుంఠంలో వ్రేలాడగట్టి వుంటుందని విన్నాను. దయచేసి తమరు ఆ లిస్ట్‌లో నా పేరు వుందేమో చూసి తిరిగి వచ్చేటప్పుడు నాకు తెలియజేయ వలసింది' అని ప్రార్థించాడు. గంధర్వుడు అలాగేనని చెప్పి వెళ్ళిపోయాడు.

కొన్ని రోజులకు ఆ గంధర్వడు తిరిగి వచ్చి, 'అయ్యా! ఆ లిస్ట్‌లో తమ పేరు లేదు. అహం భావం కలిగి, తానొక గొప్ప తపస్వినే భావంతో విఱ్ఱవీగేవారికి మోక్షార్హత లేదని, వినయము, విధేయత, నిగర్వము, కలవారికే అక్కడ చోటుగలదని, కేవలం శరీరాన్ని శుష్కింపజేస్తూ చేయడం కాదని, మనస్సులో దాగిన దుస్సంకల్పాలను, దుర్వాసనలను త్యజించటవే మోక్షమునకు అసలైన మార్గము' అని చెప్పి వెళ్ళిపోయాడు.

- పరమార్థ కథల నుండి

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## విశ్వనాథం మావయ్యతో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

ఆశ్రమంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి పూజలు జరుగుతున్నాయి. ఒకరోజు పూజ గదిలో పూజ ప్రారంభానికి ముందు జగన్మాత ఎదుట మౌనముద్రాంకితులై శ్రీ బాబు కూర్చుని ఉన్నారు. చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దం. వాతావరణం అత్యంత ప్రశాంతంగాను, గంభీరంగాను ఉన్నది. ఒక ప్రక్కన నివేదన కోసం రకరకాల పళ్ళు పళ్ళెంలో పేర్చి తెచ్చి పెట్టిన తరువాత, తన గాజుల చప్పుడు వినిపించినా శ్రీ బాబు మౌనానికి భంగం కలుగుతుందేమోనని తుని లక్ష్మి కూడ అక్కడ నుంచి తప్పుకున్నది. స్వామి జగన్మాతకు కుంకుమ పూజ ప్రారంభించినప్పుడు బీజాక్షర సహితముగా శ్రీ లలితా సహస్ర నామములను పఠించటానికి సిద్ధంగా ఉన్న ముగ్గురు భక్తులూ, కదలక మెదలక నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నారు.



అంతలో ఆ ముగ్గురిలోను ఒకరు "బాబూ" అని శ్రీ బాబుతో ఏదో మాట్లాడబోయారు. అంతే! ఠప్! మని ఒక బత్తాయికాయ అతివేగంగా వచ్చి ఆయన తలకు కొట్టుకుంది. నిర్ఘాంతపోయిన ఆ భక్తుడు వెంటనే తెప్పరిల్లుకుని, ఆ కాయ క్రింద పడితే పూజా ద్రవ్యాలను చిందర వందర చేయగలదనే భయంతో దానిని జాగ్రత్తగా పట్టుకొని "పోనీలే బాబూ! బత్తాయి కాయతో కొట్టి మంచి పనే చేశావు. అదే కనుక కొబ్బరికాయ అయి ఉంటే నా బట్టతల పగిలిపోయి ఉండేది. దానికేముందిలే గాని, ఎలాగో ఒక కాయి విసిరావు కనుక యింకొకటి కూడా విసిరితే రసం తీసుకుని తాగుతాను" అన్నారు. అంతటి గంభీరతను మరచి శ్రీ బాబు ఫక్కున నవ్వేశారు. పిడుగులు పడతాయని భయపడుతున్న మిగతా యిద్దరు భక్తులు 'హమ్మయ్య!' బ్రతికాము అనుకున్నారు. తుఫానుకు బదులు వెన్నెలలు పగలే విరిశాయి. అంతటి సాహసం చేయగలిగిన భక్తుడే విశ్వనాథం మామయ్య.

శ్రీ వారణాసి కాశీ విశ్వనాధ శాస్త్రిగారు (విశ్వనాధం మామయ్య) గుండుగొలను వాస్తవ్యులైన సద్బ్రాహ్మణులు. స్మార్తంలో మంచి ప్రావీణ్యం సంపాదించి, వివాహోపనయనాది కార్యములే గాక, క్రతువులు వ్రతాలు కూడ చేయించే వారు. గుండుగొలనులోను, పోతునూరు తదితర చుట్టు ప్రక్కల గ్రామాలలోనివారు, ముఖ్యంగా క్షత్రియులందరు మామయ్యతోనే అన్ని శుభాశుభ కార్యాలకు పౌరోహిత్యం చేయించుకునే వారు.

శ్రీ బాబుతో సన్నిహితులుగాను, ఆత్మీయులుగాను మెలిగిన వారు చాలా మందే ఉండవచ్చును గాని, పైన చెప్పిన సంఘటనలో వలె మాట్లాడే చనువు గలవారు, 'నువ్వు' అని శ్రీబాబును సంబోధించే స్వతంత్రం గలవారు విశ్వనాధం మామయ్య ఒక్కరే. అది సాహసం అనడం కంటే అమాయకత్వం అనటం ఎక్కువ సమంజసంగా ఉంటుంది.

విశ్వనాధం మామయ్యకు కోపం తెలియదు. ఇతరులు తనను కోపగించినా, ఎత్తిపొడిచినా ఆయన ఒక చిరునవ్వు మాత్రమే సమాధానంగా యిచ్చేవారు. పురోహిత వృత్తిలో కూడా ఆశలేని వారు. ఏది లభిస్తే దానితో తృప్తి పడేవారు. బొత్తిగా కల్లాకపటం తెలియని వారు. అన్నిటికన్న ముఖ్యంగా, శ్రీ బాబు ఆధ్యాత్మిక మహోన్నత్యాన్ని గురించి ఏమీ తెలియకపోయినా, వారి ప్రథమ దర్శనం నుండే మామయ్య శ్రీబాబును దైవ సమానంగాను తనకు ఏకైక ఆత్మీయునిగాను నిశ్చయించుకుని, తనను ఉద్ధరించగలవారు శ్రీబాబే అని వారిని ఆశ్రయించారు. మామయ్య వ్యక్తిత్వంలోని యీ విశిష్ఠ లక్షణాల వలననే శ్రీబాబు ఆయనను ఎంతగానో ప్రేమించేవారు; అభిమానించేవారు. హాస్యప్రియులైన శ్రీబాబు మామయ్యను ఒక శిష్యుని వలె గాక, చెలికాని వలె చేరదీసి ఛలోక్తులతో అలరిస్తూ ఉండేవారు.

విశ్వనాధం మామయ్యకు పిల్లలు లేరు. లేరనే దిగులూ ఏనాడూ ఆయనకు ఉండేది కాదు. "మామయ్యా! నీకు నామీద ఉన్న ప్రేమ సముద్రమంతటిది. సముద్రానికి తన అల్లుడంటే ఎంత యిష్టమో! అందుకని నేను నీకు అల్లుణ్ణి అవుతాను ఎప్పుడూ నిన్ను 'మామయ్యా!' అని యిలాగే పిలుచుకుంటాను. సరేనా"? అన్నారు శ్రీ బాబు. మామయ్య "అంతకంటే మహాభాగ్యమేమున్నది బాబూ ! నువ్వు సాక్షాత్తు శ్రీమన్నారాయణ మూర్తివే కదా! " అన్నారు.

-సశేషం

-రమణ ప్రసాద్




# శ్రీ శంకర భగవత్పాదులు

సూర్యుడు గంగయందు ప్రకాశించినట్లే చండాల వాటిక యందును ప్రకాశిస్తున్నాడు. ఈ రెండు ప్రకాశాలకు తేడా ఉందా? బంగారు బిందె, మట్టికుండలలో ఉన్న ఆకాశంలో తేడా ఉందా? లేదే అలాగే సర్వ శరీరాలలోనూ ఒకే వస్తువు భాసిస్తోంది. ఆ వస్తువు ఆనందమైనది, పూర్ణమైనది.



ఆచార్యుల వారు పశ్చాత్తాపపడి, అయ్యా! బ్రాహ్మణుడైనా సరే, చండాలుడైనా సరే తమరు నాకు గురువే" అన్నారు.

**జాగ్రత్స్వప్న సుషుప్తిషు స్ఫుటతరా యాసంవిదు జృంభతే। యాబ్రహ్మాది పిపీలికాన్త తనుషు ప్రోతా జగత్సాక్షిణీ ॥**

"జాగ్రత్స్వప్న సుషుప్తులలో ఏ చైతన్యం మిక్కిలి స్ఫుటంగా ప్రకాశిస్తున్నదో, ఏది చీమ మొదలు బ్రహ్మవరకు గల సర్వ శరీరాలలోనూ సాక్షిగా నెలకొన్నదో ఆ చైతన్యమే 'నేను' కాని, ఈ దృశ్యమైన జడ వస్తువు నేను కాదు, అనే జ్ఞానం ఎవనియందు దృఢమై ఉంటుందో వాడు చండాలుడైనా సరే ద్విజుడైనా సరే అతడు నాకు గురువు." అని పలికారు శంకర భగవత్పాదులు.

ఆ మాలవాడి రూపంలో వచ్చింది కాశీ విశ్వేశ్వరుడే. ఆచార్యుల వారిని పరిశోధించటానికి అలా వచ్చారు.

**భజగోవిందం:**

ఒకనాడు శంకరుడు శిష్యులు వెంటరాగా కాశీనగర వీధులలో వెళ్తు న్నారు.. ఒక ఇంటి అరుగుపై ఒక వృద్ధుడు వ్యాకరణ సూత్రాలను వల్లిస్తూ ఉన్నాడు. శంకరుడు జాలిపడి "ఎందుకు స్వామీ! ఇంత కష్టపడి వ్యాకరణ సూత్రాలు ఈ వృద్ధాప్యంలో వల్లె వేస్తూ కాలం వృధా చేస్తున్నారు? అవసాన సమయంలో అవి నిన్ను రక్షిస్తాయా? భగవంతుని భజించి తరించు" అంటూ .......

**భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే।**
**సంప్రాప్తే సన్నిహితే కాలే నహినహి రక్షతి డుకృఞ్కరణే॥**

అని ప్రారంభమయ్యే శ్లోకాలతో వేదాంతం అంతా నిక్షిప్తం చేసి ఉపదేశించాడు. అదే "భజగోవిందం" అనే గ్రంథం.

అనంతర కాలంలో భగవద్గీతకు, దశోపనిషత్తులకు, మాండూక్యోపనిషత్తుకు, భాష్యం వ్రాశాడు. మాండూక్య భాష్యం శంకరాద్వైతానికి మూల గ్రంథంగా ప్రసిద్ధి గాంచింది.

ఆ కాలంలో బౌద్ధం, జైనం, శైవం, వైష్ణవం, సౌరం, శాక్తేయం, పాశుపతం, పాంచరాత్రం, కాపాలికం ఇంకా ఎన్నెన్నో మతాలు వ్యాప్తంలో ఉన్నాయి. నరబలులు, జంతు బలులు వంటి క్రూరాచారాలు కూడా వుండేవి. వాటన్నిటిని ఖండిస్తూ స్వమత్వాన్ని ప్రతిష్ఠిస్తూ దేశం నలుమూలల ప్రచారం చేస్తూ తిరిగాడు. రానురాను అతని శిష్య బృందం పెరిగిపోయింది.

**కుమారిలభట్టు :**

ముఖ్యంగా ఆనాడు జైమినీయ పూర్వమీమాంసా మతం విశేషవ్యాప్తంగా ఉన్నది. అది వైదిక కర్మకాండకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తుంది. పూర్వమీమాంసకుల కులపతి కుమారిలభట్టు మహాతత్త్వవేత్త. భౌద్ధమతాన్ని ఖండించటానికి బౌద్ధవిహారాలలో బౌద్ధ సన్యాసి వేషంలో చేరి వారి గుట్టుమట్టులన్నీ లాగి వాదాలలో వారిని ఓడించాడు. వేదాలు స్వతఃప్రమాణాలు అంటూ, సృష్టికర్త అయిన ఈశ్వరుడిని కూడ తిరస్కరించేవాడు. కాని బౌద్ధులను వంచించటం, ఈశ్వరుడు లేడని వాదించటం అతడికి వృద్ధాప్యంలో పశ్చాత్తాపం తెచ్చిపెట్టాయి. తన పాపానికి ప్రాయశ్చిత్తంగా ఆత్మాహుతి చేసుకోదలచాడు. తుషాగ్ని (ఊకను అంటించిన అగ్ని ) లో దహనం కావటానికి నిశ్చయించాడు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD